# బహుమతి కోసం

'ఏమండీ, ఆంధ్రుల జీవితం అంటే ఏమిటండీ?' అని అడిగాను ఆయనవైపుకి వొత్తిగిలి పడుకుంటూ.

'ఏమిటాచొప్పదంటుప్రశ్న? ఏం, నువ్వు అమెరికా నుండి ఊడి పడ్డావా అన్నారాయన చిరునవ్వుతో.

'నేనడిగింది ఎలాంటి ప్రశ్న అయితేనేం, తెలిస్తే సమాధానం చెప్పరాదూ' అంటూ విసుక్కున్నాను.

'కొంపతీసి మళ్ళీ పోటీ కథ రాద్దామనా' అన్నారు నవ్వుతూ. నా రహస్యం పసిగట్టేసినట్లు, గర్వంతో మెరుస్తున్నాయి ఆయన కళ్ళు. నేను ముసిముసిగా నవ్వాను.

'లాభం లేదు. నీకు రాదే. ఎందుకొచ్చిన తిప్పలు! కావాలంటే ఆ ప్రైజుడబ్బు నేను ఇన్‌స్టాల్‌మెంటుబేసిస్ మీద ఇచ్చుకుంటాను గాని....' అన్నారు వేలకువేలు సంపాదిస్తున్నానన్న అహంభావంతో.

ఎంతయినా నేను స్వయంగా డబ్బు సంపాదించటం వేరు— ఆయన ఇస్తే పుచ్చుకోవటం వేరు. స్వయంసంపాదన ఎంత ఆత్మ

ధైర్యాన్నీ ఆనందాన్నీ ఇస్తుంది! కాకపోయినా, ఇది డబ్బు కోసం కూడా కాదు. కథలు రాయాలనే పిచ్చి నాకు చిన్నప్పటి నుంచీ ఉంది. అందులోనూ పోటీకథల్లో పాల్గొంటే ఒక విధమయిన ఉత్సాహం పుడుతుంది. విజయం సాధిస్తే ఇక ఊహించనక్కర్లేదు. ఇంతవరకు నాకు ఒక్కసారీ బహుమతి రాలేదు. కనీసం కన్సొలేషన్ బహుమతి కూడా రాలేదు.

ఒకసారి కథ పంపిస్తూ కవరు మీద ఫలానా పోటీకి అని రాయటం మరిచిపోయాను. అసలు మరిచిపోయింది ఆ విధంగా కాదు. కథ పోస్టు చెయ్యమని ఆయన కిస్తూ కవరుమీద పోటీ విషయం రాయమని చెప్పటం మరిచిపోయాను. ఆయన రాయనూ లేదు. బహుమతి రాకపోయేసరికి అప్పుడు 'పోస్టుమార్టమ్' చెయ్యగా తేలిన విషయమది.

మరోసారి—బహుమతి వస్తే వచ్చింది లేకపోతే లేదు, తిరిగి పంపించనన్నా పంపిస్తారు కదా అని స్టాంపులు జతచేసి పంపించాను. 'తగినన్ని తపాలాబిళ్ళలు' పంపలేదన్న నెపంమీద తిరిగి పంపించనన్నా పంపించలేదు. నిక్షేపంలాంటి కథ—చచ్చి ఏ స్వర్గాన ఉన్నదో తెలియదు.

అప్పటినుంచీ అన్ని నిబంధనల సంగతీ ఆయనతో సంప్రదించి మరీ రాద్దామని నిర్ణయించుకున్నాను. అయితే, ఆయన సలహా తీసుకుంటే ఒక్కొక్కప్పుడు కుక్కతోక పట్టుకుని గోదావరి ఈదినట్లే. ఓసారి 'స్త్రీల ముఖ్యసమస్య ఏమిటి' అని ఒక వ్యాసాల పోటీపెట్టారు ఒక పత్రికవాళ్ళు. ఆ ప్రకటన చదివిన వెంటనే ఆ రాత్రి (సాధారణంగా రాత్రి పూటే ఇటువంటి విషయాలు ముచ్చటించటానికి అనువైన సమయం కదా) మావారి దగ్గరికి చేరి 'ఏమండీ, స్త్రీల ముఖ్యసమస్య ఏమిటి?' అని అడిగాను. తక్కున సమాధానం చెప్పారు రెండక్షరాలతో—నెలనెలా పడే బాధని. మొదట ఉడుకుమోత్తనం, తరవాత నవ్వూ వచ్చాయి నాకు

ఆయన సమాధానానికి. ఆలోచించగా, 'అవును స్మీ' అనిపించింది. కాని చూస్తూ చూస్తూ అటువంటి విషయం మీద వ్యాసం ఎలా రాయను— అందులోనూ పోటీకి ! రాసినా, వాళ్ళు సహృదయంతో స్వీకరిస్తారన్న నమ్మకం ఏమిటి ? పోనీ, నా అంతట నేనే ఆలోచించి ఇంకేదైనా స్త్రీల సమస్య గురించి రాద్దామా అనుకున్నాను. అయితే, వారి మాట ప్రభావం ఏమిటోగాని ఆయన చెప్పిన సమస్యముందు తక్కిన సమస్యలన్నీ సూర్యుని ముందు కాగడాలాగ వెలవెలబోయాయి. ఇక రాయబుద్ధికాలేదు. స్త్రీలకి స్వతంత్రంగా ఆలోచించటం, స్వతంత్రంగా పనులు చేయగల గటమే ఒక సమస్యేమో ననిపించింది—ముఖ్యంగా నా విషయంలో. నా బలహీనత నాకు తెలుసు. భారతీయస్త్రీలకు తరతరాలుగా వస్తున్న వారసత్వం అది.

అలవాటు చొప్పున ప్రతిసారీ ఆయన్ని అడుగుతూనే ఉంటాను. ఓసారి పోటీకి కథ రాసే ముందు

'ఏమండీ, అరతావు అంటే ఎంత?' అని అడిగాను. అప్పట్లో అరతావుకి నిర్వచనం ఇచ్చేవారు కాదు సంపాదకులు. నాలాంటి వాళ్ళ ధర్మసందేహాలు చూసే ప్రారంభించా రనుకుంటాను. ఇంతకీ అరతావుకి మావారిచ్చిన నిర్వచనం ప్రకారం నేను ఏదో కథ రాసి పంపించాను. ఏం తేడా వచ్చిందోగాని అది బహుమతి దరిదాపులికి కూడా పోలేదు.

ఈసారి అన్ని పోటీ నిబంధనలూ పదేపదే చదువుకున్నాను. అన్నీ స్పష్టంగానే ఉన్నాయి. ఎటొచ్చీ 'ఆంధ్రుల జీవితానికి సంబంధించి నదై ఉండాలి' అన్న నిబంధనే నాకు కరక్కాయలా కొరుకుడు పడ లేదు. ఇన్నాళ్లూ నేను ఆ నిబంధన అంత ముఖ్యమైనదనుకోలేదు. నేను తెలుగుదాన్నే కదా, నే రాసినది మరో జీవితాన్ని ఎలా ప్రతిబింబింప

చేస్తుంది? (కాపీ కొడితే తప్ప) అని నా అంతరాత్మ అనుకునేదేమో, అసలా సందేహమే రాలేదు. పైగా, అగ్గిపుల్ల, సబ్బుబిళ్ళ మీద కవిత్వం రాయగా లేనిది కథలకి వస్తుప్రాముఖ్యం ఏమిటనే ఉద్దేశంతో నేను రాస్తున్న కథ ఆంధ్రుల జీవితం గురించి అవునా కాదా అని ఇంతకు ముందెప్పుడూ నేను ఆలోచించని మాట వాస్తవం.

ఈమాటు దాని కిటుకేమిటో తెలుసుకుని ఎలా అయినా బహుమతి కొట్టెయ్యాలనే పట్టుదల ఆవహించింది నన్ను. అందుకే మంచి తరుణం చూసి ఆయన్ని అడిగాను—'ఆంధ్రుల జీవితం అంటే ఏమిటండీ' అని. తీరా చేసి 'చొప్పదంటుప్రశ్న' అని ఆయన కొట్టి పారేసేసరికి నాకు మతి పోయింది. అంత తేటతెల్లమయిన విషయమైతే సంపాదకులు మాత్రం అంత స్పష్టంగా నిబంధనల్లో ఎందుకు చేరుస్తారు? అందులో ఏదో మర్మం ఉండే ఉంటుంది. ఈ ఆంధ్రుల జీవితం సంగతేమిటో, దాని అజా పజా తేల్చుకోవాలని నిశ్చయించుకున్నాను.

ఆ రాత్రికి ఆయన దగ్గర్నుంచి సమాధానం రాబట్టలేకపోయాను. ఆ మర్నాడు నేనేదో ఆలోచిస్తూ పడక్కుర్చీలో కూర్చుండగా చూసి ఆయన 'ఏం, ఇంకా ఆంధ్రుల జీవితం గురించే ఆలోచిస్తున్నావా' అన్నారు హేళనగా నవ్వుతూ. నేను సమాధానం చెప్పకుండా ఆకాశం వైపు చూస్తూ కూర్చున్నాను.

'ఇవ్వాళ రాత్రికి వంటేం చేశావు' అన్నారు.

'చామదుంపలకూర, చారు' అన్నాను ముక్తసరిగా.

'అబ్బబ్బా, ప్రాసకోసం నా ప్రాణాలు తియ్యకపోతే, ఏ కంది పచ్చడి, మెంతి మజ్జిగో చేశానంటే ఏం కొంప మునిగింది? కంది పచ్చడి తిని ఎన్నాళ్ళయిందో' అన్నారు అర్ధనిమీలితనేత్రాలతో చూస్తూ.

'ఆ వెధవ కంద పచ్చడిలో రుచి ఏముంటుంది బాబూ' అన్నాను రుబ్బటం సంగతి మనస్సులో మెదిలి.

'అదీ! కంది పచ్చడి రుచి తెలియనిదానివి ఆంధ్రుల జీవితాన్ని గురించి ఏం రాయగలవు' అని ఈసడించారాయన.

'నాకు నచ్చనంత మాత్రాన మీకు చేసిపెట్టనన్నానా' అంటూ లేచి నడుం బిగించాను.

'ఇప్పు డొద్దులే, నీ పాతివ్రత్యానికి మెచ్చాను కానీ-రేపు తీరిగ్గా చేద్దుగాని' అంటూ నా నడుం చుట్టూ చెయ్యి వేసి దగ్గరికి లాక్కో బోయారు.

'ఉష్, వాళ్ళు చూస్తారు' అన్నాను ఎదురింటి డాబాగదివైపు సూచిస్తూ.

'నా ఇంట్లో నా పెళ్ళాన్ని దగ్గరికి తీసుకుంటే మధ్య వాళ్ళేమను కుంటారే! చూడు! ఆ స్కూటరుమీద అమ్మాయి అతన్ని ఎలా వాటేసు కూర్చుందో' అన్నారు రోడ్డుమీద పోతున్న పంజాబీ జంటను చూపిస్తూ.

'ఎంతయినా మనవాళ్ళు అంతగా బరితెగించలేరుస్మండీ' అన్నాను.

'చూశావా, ఆంధ్రుల జీవితంలో ఇదొక పాయింటు-నోట్ చేసుకో' అన్నారు గిరీశం పోజుపెట్టి.

ఆ రాత్రి పోటీకథని ఆంధ్రుల జీవితానికి సంబంధించినట్లు రాయ టానికి కథలో ఏమేం ప్రవేశపెట్టాలో ఆలోచించాను. మావారు తెచ్చిన 'కంది పచ్చడి' సంభాషణ గుర్తుకొచ్చి మెరుపులా ఒక ఆలోచన వచ్చింది.

బాక్సాఫీస్ హిట్ కావటానికి నైట్‌క్లబ్ డాన్సులూ, పార్కుల్లో యుగళగీతాలూ, తులసికోట దగ్గర విలాపం, ఒక ముష్టియుద్ధం, కత్తిసాము, భరతనాట్యం, తోలుబొమ్మలాట ఒకే సినిమాలో జొప్పించినట్లు ఆంధ్రుల జీవితంలోని కొన్ని ముఖ్యమయిన అంశాలను పడికట్టురాళ్ళలా నా కథలో వాడితే బహుమతి నాకు కాక ఇంకెవరి కొస్తుంది-అనుకుని ఆ పడికట్టురాళ్ళని వరసగా పేర్చటం మొదలుపెట్టాను.

దీపావళి పండగకి అల్లుడూ, కూతురూ వచ్చినట్లు, బావగారు మరదల్ని టపాకాయల్తోనూ కప్పగంతుల్తోనూ వేళాకోళాలాడటం, కొత్త పెళ్ళాం అసూయపడటం ఘట్టం ఒకటి; సంక్రాంతికి సందులోవాళ్ళతో పోటీగా పెళ్ళికాని పిల్లలు వాకిళ్ళముందు ముగ్గులు పెట్టడం, జంగంవాడు తెలుగు పదాలు పాడుకుంటూ రావటం, చిన్నపిల్ల చాటలో బియ్యం పోసుకొచ్చి జంగంవాడి జోలెలో పొయ్యటం ఘట్టం ఒకటి; తీరా పండగకి అల్లుణ్ణి పిలిచాక అమ్మాయి బయటుంటే, అల్లుడు మరదలు పిల్లని తీసుకుని కాలవగట్టుకి షికారు చెక్కేస్తూంటే అమ్మాయి మూలకూర్చుని తల్లి ఆచారాన్ని తిట్టుకుంటూ గుడ్లనీళ్ళు కుక్కుకునే ఘట్టం ఒకటి; రెండెడ్ల బండిలో తిరణాలకి వెళ్ళటం, దారిలో బండి క్రింద చిక్కంలోంచి ముంజెకాయలు తీసి బండివాడు ముంజెలు కొట్టిస్తూంటే తినటం ఘట్టం ఒకటి; పండగకి రేడియో ఇస్తామని ఆశపెట్టి మామగారు మోసంచేశారని అల్లుడు పెళ్ళాన్ని తనతో తీసుకుపోనని బెదిరించటం, ఆ పిల్ల కళ్ళనీళ్ళు పెట్టుకుని తల్లిని ప్రాధేయపడటం, తల్లి సలహా విని తండ్రి ధోవతి బిగదీసి, ఉత్తరీయం ఝాడించి రంకెలు వేయటం, ఆఖరికి వచ్చే దసరాకి తప్పకుండా ఇస్తామని వాగ్దానం చేయించి అమ్మాయి తన భర్త పాదాల చెంత రవంత చోటు చేసుకుని బండిలో బయలుదేరే ఘట్టం ఒకటి—నాకథలో ప్రవేశపెట్టాలని ఆలోచించాను.

మరోరకం కథకి-ఉమ్మడి కుటుంబంలో తోటికోడళ్ళ తగాదాలూ, చిన్న కొడుకు పెళ్ళాం మాట విని ఆస్తిపంచమని పేచీపెట్టడం, ససేమిరా, తన బొందిలో ప్రాణం ఉండగా ఆస్తి పంపకం కుదరదని తండ్రి జంధ్యంతో గిరజుకోవటం, తల్లి కళ్ళనీళ్ళతో కలుగజేసుకోబోతే, 'ఇదుగో, ఇలాగే పిల్లల్ని మొకట్నించీ చెడగొడుతున్నావ్'అని పెళ్ళాన్ని ఛెడామడా తిట్టడం—లాంటి ఘట్టాలు కొన్ని ఊహించాను.

ఇవి కాకపోతే, ఒక పెళ్ళి—అందులో పానకం బిందెలు చిన్నవనీ, కాళ్ళుకడుగు పళ్ళెం రేకులా ఉందనీ, లాంఛనాలు అనుకున్నట్లు జరిపించ లేదనీ, భోజనానికి పిలుపులు రెండోసారి అందలేదని అత్త, ఆడబిడ్డల తగువులూ, పెళ్ళికొడుకు అలకపాన్పూ, విడిదిలో బంతులాటా, ఊరేగింపూ-తరువాత శోభనం, దానికి-పడగ్గది అలంకరణ, చుట్టాలూ స్నేహితులూ పరాచికాలూ దంపత్తాంబులాలూ, అవతల గొళ్ళెంపెట్టడం, చిన్నవాళ్ళు తలుపుల సందుల్లోంచి చూడటం, పెద్దవాళ్ళు వాళ్ళని తరిమెయ్యటం,లోపల చీకట్లో అగరొత్తుల ధూపం, మల్లెల గుబాళింపు—ఇలా ఆలోచిస్తూంటే హఠాత్తుగా ఆయన చెయ్యి నన్ను చుట్టివేసేసరికి నా కథ ఆగిపోయింది అప్పటికి.

మర్నాడు ఆలోచనలు మరో విధంగా సాగాయి, తెలుగు జీవితానికి సంబంధించిన సంఘటనలు కొన్ని పడికట్టురాళ్ళలా కథలో ప్రవేశపెడితే కథ తెలుగుతనాన్ని పులుముకోవచ్చునేమో కాని, తీరా చేస్తే ఎక్కడో చదివిన కథలా పరిచితంగా అనిపిస్తుందేమో-నాలుగు సినిమాలలోంచి ఘట్టాలు తీసి మరో సినిమా తీసినట్టు! చివరికి ఎవరో పాఠకుడు ఆవిడ కథ ఫలానా రచయిత రాసిన దానికి నకలు అనో, ఫలానా సంఘటన గురించేననో అన్నాడంటే తలకొట్టేసినట్లవుతుంది.

అదీకాక, నేను ప్రవేశపెట్టాలనుకున్న ఘట్టాలు ఎన్ని మెలికలు తిప్పినా సహజత్వానికి దగ్గరగా ఉండవేమోనన్న అనుమానం వచ్చింది. నేను కథలో ఇరికించాలనుకున్న తెలుగుతనాన్ని ప్రతిబింబించే ఘట్టాలన్నీ ఎప్పుడో నా చిన్నతనంలో వేసవి సెలవుల్లో మా తాతయ్యగారి ఊరు వెళ్ళినప్పుడు జరిగినవీ, గమనించినవీను. మా తాతయ్యగారు పోయాక, ఉమ్మడి కుటుంబం విడిపోయి, ఆస్తులు హరించిపోయాక, మేము పై చదువుల్లో ప్రవేశించాక మళ్ళీ ఆ పల్లెటూరు ప్రాంతాలకి వెళ్ళలేదు నేను.

ఇప్పుడా కరణంగారి అల్లుడు ఇంకా మామగార్ని అవీ ఇవీ ఇమ్మని పేచీపెడుతున్నాడేమో తెలియదు. అటువంటి అల్లుళ్ళు ఇంకా ఉన్నారో లేదో నాకు తెలియదు. ఇప్పటికీ జంగంవాళ్ళు పదాలు పాడుతూ తెల్లవారుజామునే వీథులమ్మట వస్తున్నారో, లేకపోతే సినిమాల్లో చేరిపోయి మరి నాలుగుడబ్బులు సంపాదించుకుని మూడుపువ్వులు, ఆరుకాయలుగా ఉన్నారో తెలియదు.

ఇప్పుడు మా తాతగారి ఊళ్లోకూడా సైకిలురిక్షాలూ, సిటీబస్సులూ పోతున్నాయట. రెండెడ్లబళ్ళ మీద ప్రయాణాలు మానేసినట్లే.

ఇప్పుడు వారం పదిరోజులకోసారి పట్నానికి తెలుగు సినిమాలు చూడటానికి పోతున్నారు జనం—తిరణాలకి పోవటం తగ్గిపోయినట్లుంది.

పాలవాడూ, కిళ్ళీ కొట్టువాడూ ట్రాన్సిస్టరు వింటూనే వ్యాపారం చేస్తున్నారు.

ఈమధ్య మా ఆడబడుచు పెళ్ళిలో ఇంటి చాకలిదానికి కంటికి ఇంపుగా ఉన్న ఎర్రని నేతచీర కొనుక్కొచ్చి పెడితే నేలమీదికి ఒక్క విసురు విసిరేసింది. 'ఈ ముతక సీర నాను కట్టలేనమ్మో, నైలాను సీర

నేకపోతేపాయె ఒక వోయిలుసీరన్నా ఎట్టారుగాదు— ఇదేటమ్మా ఇంత శాకిరి సేస్తేనూ' అంటూ గయ్యిమంది.

పెళ్ళిలో అంతా కోకోకోలా, కోకోకోలా అంటూ ఒకటే గోల. పానకం బిందెల సంగతి పట్టించుకున్నవాళ్ళెవరూ లేరు. పురోహితుడు పెళ్ళికూతుర్ని ఫొటోగ్రాఫర్ వైపు సరిగ్గా చూడమంటున్నాడు--- అరుంధతి నక్షత్రం వైపు కాదు.

పేర్లు చెప్పమని ఎవరో పెద్దముత్తైదువలు పెళ్ళికూతుర్ని అడిగారు గుమ్మందగ్గర. ఠక్కున చెప్పింది 'మూర్తీ, నేనూ వచ్చాము' అని. 'మూర్తిగారు' అనికూడా అనలేదు (వాళ్ళ పెళ్ళికి ముందు రెండు మూడు సార్లు కలుసుకుని గంటలకొద్దీ ముచ్చట్లాడుకున్నారు ఒకరి నొకరు అర్థం చేసుకునేందుకు). పేర్లు చెప్పమని అడిగిన ముత్తైదువలు ముఖ ముఖాలు చూసుకున్నారు.

సన్నాయివాళ్ళు కొత్తగా వచ్చిన తెలుగు, హిందీ సినిమాపాటలు వాయిస్తున్నారు. ఊరుకోలేక నేనువెళ్ళి 'ఏవన్నా కృతులుగాని అష్టపదులు గాని వాయించకూడదండీ' అన్నాను. 'అబ్బే, ఈ రోజుల్లో అయ్యోవరికి నచ్చుతయ్యండీ' అన్నాడు నన్ను ఎగాదిగా చూస్తూ—ఏ ఊరి బాపతు అన్నట్లుగా. ముహూర్తం సమయంలోకూడా 'సీతమ్మ పెళ్ళికూతురాయెనే' వాయించలేదు. 'పందిట్లో పెళ్ళవుతున్నదీ, కనువిందవుతున్నదీ' అంటూ ఏదో సినిమాలో పాట వాయించాడు. పురోహితుడు కూడా అంతగా పట్టించుకున్నట్లు లేదు.

ఎవరో ముసలమ్మలు మండువాలో కూర్చుని 'మనుగుడుపులికి ఎవరెవరు వెడుతున్నారర్రా' అన్నారు. 'మనుగుడుపులు ఏమిటి ఆంటీ' అని మా మేనకోడలు అడిగింది నన్ను. 'ఆ మనుగుడుపులూ మూడు

నిద్రలూ మీరు కానివ్వండి. పెళ్ళికొడుక్కి సెలవు దొరకలేదుట పెళ్ళి కూతుర్ని తీసుకుని ఈ రాత్రిబండికే హైదరాబాదు వెళ్ళిపోతున్నాడు' అన్నారు మామగారు.

రోజులు మారిపోయాయి తెలుగుతనం మన జీవితాల్లోంచి క్రమేపీ తరలిపోతోంది. ఇంకా మన పండగలూ శుభకార్యాలూ శాస్త్రయుక్తంగా నిర్వహించగలవాళ్ళూ లేరు—నిర్వహించగల పరిస్థితులూ కావు. నిత్య జీవితంలో కూడా మడీ దడీ అంటూ ఆచారాలు సాగటంలేదు ఈరోజుల్లో. అంతా బల్లలమీద భోజనాలూ—గాజుగ్లాసులూ, పింగాణీకప్పులూనూ—వెండిగ్లాసులూ, వెండికంచాలూ ఏనాడో వెనకపడ్డాయి. పట్నవాసపు సముద్రంలో పల్లెలన్నీ వచ్చి కొట్టుకుపోతున్నాయి. ఇంకా ఆంధ్రుల జీవితం అంటూ అర్రులు చాచటంలో అర్థంలేదు. నైలాను చీరలూ, వాయిలు చీరలూ కట్టని ఆధునిక ఆంధ్రవనిత లేదు. ధోవతి కట్టుకుని భుజాన ఉత్తరీయం వేసుకుని ఉద్యోగానికి పోయే తెలుగు యువకులూ లేరు. రిటైరై పోయిన ముసలివాళ్ళు తమ గడచిన జీవితాన్ని తీరిగ్గా కూర్చుని పునశ్చరణ చేసుకున్నట్లు ఏనాటి రోజుల్నో, ఏనాటి అనుభవాల్నో తలుచుకుని ఈనాటికీ జరుగుతున్నట్లు కథలో రాయటం జరుగుతోంది. నైట్ క్లబ్బులూ, పార్కుల్లో ప్రేయసీ ప్రియుల పాటలూ నిత్యజీవితంతో పోలిస్తే ఎంత అసహజంగా తోస్తాయో, అలాగే పెళ్ళిళ్ళూ, పేరంటాలూ, కట్నాలూ కానుకలూ, పండుగలూ పబ్బాలూ కూడా సహజత్వాన్నీ, వాస్తవికతనూ కోల్పోయి కవిత్వంగా కనపడుతున్నాయి.

ఈ వైవిధ్యం అంతా నా కథలో చిత్రిస్తే-నిజం మాట్లాడితే నిష్ఠూరం అన్నట్లు-సంపాదకులు కినుకవహిస్తారేమో—తెలుగుతనాన్ని కించపరుస్తు

న్నానని అపార్థం చేసుకుంటారేమో-ఇహనాకు పోటీలో బహుమతి ఎలా వస్తుంది?

ఎలా రాస్తే బహుమతి వస్తుంది? పోనీ, కథలో మనుషులపేర్లూ ఊళ్ళపేర్లూ తెలుగువి పెట్టుకుని ఏదో ఒక కథ తోచినట్లు రాసేద్దామా అని కూడా అనుకున్నాను. కానీ, నాకే అనుమానం వచ్చింది. సుబ్బారావు, బొబ్బర్లంక అని వాడినంత మాత్రాన అది తెలుగు కథ అయిపోతుందా? అటువంటి కథకి కన్నడదేశంలో గాని మహారాష్ట్రదేశంలో గాని జరిగే సంఘటనలకు సంబంధం ఉండకూడదా? నాకథలో 'సాంబారు వడ్డిస్తూ' అని వాడినంత మాత్రాన అది అరవ జీవితాన్ని ప్రతిబింబింప జేస్తుందా?

అసలు ఇంతకీ ఆంధ్రుల జీవితం అంటే-ఏనాటి ఆంధ్రుల జీవితం అయివుండాలి? శాతవాహనుల కాలం నాటి ఆంధ్రుల జీవితమా, మన తాత ముత్తాతలనాటి ఆంధ్రుల జీవితమా, నేటి ఆంధ్రుల జీవితమా? ఏ ప్రదేశపు ఆంధ్రుల జీవితం? గుంటూరు, గోదావరి జిల్లాల ఆంధ్రుల జీవితమా, తెలంగాణా ఆంధ్రుల జీవితమా, ప్రవాసాంధ్రుల జీవితమా?

'అరతావు'ని నిర్వచించినట్లు ఆంధ్రుల జీవితాన్ని కూడా సంపాదకులు నిర్వచిస్తే బాగుండును. నా సందేహాలు నివృత్తి అయి వుండేవి.

ఒకవేళ సంపాదకులు ఆంధ్రుల జీవితాన్ని ఫలానా అని నిర్వచించినా అది నేనెరుగున్న జీవితం కానట్లయితే, నాకు తెలియని వాతావరణాన్ని బొత్తిగా కల్పించి రాసినట్లుగా కథ సహజత్వాన్నీ వాస్తవికతనీ కోల్పోతుందేమో. నా మనస్సుకి తృప్తినివ్వని కథని రాస్తే అది ఆత్మవంచన కూడా అవుతుంది.

ఇదంతా ఆలోచించిన మీదట కథ రాయాలన్న ఉత్సాహం క్షీణించి పోయింది. పోటీమాట దేవుడెరుగు. ఆత్మవంచన చేసుకుని అంత అసహజ మయిన కథ రాయకపోతేనేం అనుకున్నాను చివరికి.

కానీ, కిటికీలోంచి అందకుండా దూరాన అందంగా చందమామ కనిపిస్తున్నట్లు మూడువేల రూపాయల మొదటి బహుమతి నన్ను మురి పించటం మాత్రం మానలేదు.

(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, 26-1-'73)